# మిథ్యాప్రపంచమా?

మాతృదేశభక్తు డొకడు ఊహాప్రపంచంలో ప్రయాణంచేస్తూ ఇది అంతా మిథ్యాప్రపంచమని నిర్ణయించుకొన్నాడు.

రచయిత :
'అమరేంద్ర'

నౌక సముద్రంలో ప్రయాణం చేసి ఎన్ని కెరటాలనో ఎదిర్చి, వాటితాకుడుకు చాలా భాగం శిధిలమై తీరాన్ని సమీపించబోతోంది. తీరాన్ని చేరకముందు మృత్యువనే ఇరుకుదోవగుండా ప్రయాణం చేయాలి. ఆతరంగాలమీద మెల్లగా ఒక ప్రక్కకి ఒరుగుతూ, లేస్తూ, ప్రశాంతంగా ప్రయాణం చేస్తోంది నావ. ఆప్రయాణం యొక్క ప్రశాంతతకీ, అలలసంగీతానికీ నాకు నిద్రవస్తోంది. పడవ ఆద్వారానికి చాలా దగ్గరలోవుంది.

'నాన్నా, నాన్నా' అని గుండెలమీద తలపెట్టి ఏడుస్తున్న బిడ్డకూ, 'నాకుంకుమను ఎగురగొట్టబోకు' అని గట్టిగా ఏడుస్తూ ప్రార్థిస్తున్న భార్యనూ, వ్యాధితో కృశించిన నాకూ— మాముగ్గురికీ— మధ్య మృత్యువొక పెద్ద అఖాతాన్ని కల్పించింది; ఆ అఖాతానికి ఒక తీరాన వారూ, ఇంకొక ఒడ్డున నేను. 'నాన్నా' అని అవతలిఒడ్డునుండి పిలుస్తున్న బిడ్డ పిలుపుకు సమాధానం శూన్యం. భార్యముఖంమీది కుంకుమ కాస్తా చెరిగిపోయింది.

చితి! మంటలు, పొగలు! ఆ మంటల్లో ఒక దోవ కనిపించింది. మాతృగర్భంలోంచి ఏవిధంగా వెల్వడిందో ఆవిధంగానే శరీరం, ఈప్రపంచానికి సంబంధించిన వేవీ వెంటలేకుండానే, మృత్యుగర్భం ప్రవేశించింది. ఎదుట కనిపిస్తున్న ఆద్వారంలోంచి దూరిపోయాను.

నల్లటి తలుపులు! పెద్దద్వారం! ద్వారానికి రెండుప్రక్కలా భటులు! అంతా మన పోలీసుల్లాగానే వున్నారు, ఎర్రటోపీతప్ప! ఆ ద్వారంగుండా అతితేలిగ్గా ప్రవేశం పొందవచ్చు. భటులెవరూ నన్నడ్డగించలేదు.

అంతా చీకటి! కారుచీకటి! బాధ! మూల్గులు! ఆ వేదనతో అంతా ప్రతిధ్వనిస్తోంది. ఎక్కడా దోవ కనిపించటంలేదు. నిట్టూర్పులు! అబ్బ! వీటితో చెవులు మోగిపోతున్నయ్. హృదయం కంపిస్తోంది. దెబ్బలు కొడుతున్న మోతలు చెవుల్లో మారుమ్రోగుతున్నయ్. ఎక్కడచూసినా విషాదదేవత తన కర్ణకఠోరమైన విషాదగీతికల నాలపిస్తూన్నట్లు కనిపించింది. ఆచీకటికోణంలో ఎవరో కొందరు కనపడ్డారు. వారు వెలిబుచ్చే బాధ, నిస్పృహ, బాధలేని నాహృదయంలోకూడా బాధను కలిగిస్తున్నయ్ నేనడగటమే తరువాయిగా వారు తమ కథను నాతో చెప్పటం మొదలుపెట్టారు.

'మేము డబ్బులేని నిరుపేదలం. ధనమే మాప్రపంచంలో అందరికీ ముఖ్యం. నిరుపేదల నేదోవిధంగా పీడించి, వారిని తమలో జీర్ణించుకుంటున్నారనేకమంది ధనికులు, మాది అందరికంటే తక్కువకులం. ఇక్కడ కులభేదాలు స్వేచ్ఛగా రాజ్యమేలుతున్నయ్. మారాజుగారు నిరంకుశులు. తన రాజ్యంలో అనేకులు దరిద్రదేవతకు ఆహుతి ఔతున్నా వారి కేమాత్రమూ అవసరంలేదు. ఎవరైనా వారిమాటను ఎదిరిస్తే సరి చేతులోఉన్న 'హింస' ఆయుధాన్ని ప్రయోగిస్తారు. మాకూ సంఘానికీ చాలాదూరం. ఇక్కడి సంఘమునకు ధనమే ముఖ్యం. వారి హృదయాల్లో కంటె కారు రాతిలోనే మృదుత్వమున్నది. కళ్ళున్న ఈసంఘమునకున్న గుడ్డితనం ప్రపంచంలో మరెవ్వరికీలేదు ఈదేశంలో రాజుకూ రైతుకూ సఖ్యతలేదు. శిస్తు చెల్లించలేని రైతుల్నెందర్ని చీమలుపాకే తుమ్మచెట్లకు ఎట్లా కట్టేశారో చూ

డండి. అందువల్లనే ఇక్కడ నిట్టూర్పులు బాధతప్ప మరేవీ కనిపించవు' అని ఏడుస్తూ చెప్పారు. వారికాళ్ళకూ చేతులకూ సంకెళ్లు; వంటినిండా దెబ్బలు, నెత్తురు. వారిముఖాల్లో నిరాశ, బాధ, నిస్పృహ. అందరూ వణికిపోతున్నారు. వీళ్లు చెప్పిన మాటల్నిబట్టి చూస్తే నాప్రపంచంగుర్తుకొచ్చింది. రెంటికీ ఏమాత్రమూ తేడాలేదు. ఇంతలో ఒక భటుడు ఒకచేతిలో కత్తీ, ఇంకో చేతిలో కొరడా పుచ్చుకొని అటువైపుకొచ్చాడు. అక్కడివారంతా భయంతో సంకెళ్ళు ఈడ్చుకుంటూ దేకుతూ పారిపోయారు. ఆయన్ని చూచేసరికీ నాకు పోలీసు ఇనస్పెక్టరు గుర్తుకొచ్చాడు. ఆయన ఆకారాన్నిచూసి వణికిపోయాను గబగబా పరిగెత్తాను. భటుడు నన్ను వెంబడించాడు. పాపం ఒకటిరెండు సార్లు కిందపడ్డాడు. చివరికి నన్ను బంధించి తమ రాజుగారిదగ్గరికి తీసికెళ్లాడు. భయంతో గుండె దడదడ కొట్టుకుంటోంది. రాజుగారిముందు నిలబెట్టారు. ఎత్తైన సింహాసనం, తళతళలాడే రాజకిరీటం, వంటినిండా మోయలేనన్ని ఆభరణాలు. ముఖంలో అంతులేని ఠీవీ గర్వమూ! ''ఎందరుబీదల నోటిముందరి కూటిని పడదోసి సంపాదించుకున్నాడో అవన్నీ! ఎందరు బీదల రక్తపాతంతో గెల్చుకున్నాడో అంత రాజ్యం!' అని ఆలోచిస్తున్నాను. ఇంతలో పిడుగుపడ్డట్టు పెద్ద చప్పుడయింది. భయంతో వణికిపోయాను. అది అనేకమంది బీదలను తనలో జీర్ణించుకొని మత్తెక్కిన ఆ రాజుగారి నోటినుండి వెల్వడిన మాటలధ్వని! నన్నుగురించిన సంగతులన్నీ బాగా విచారించారు. నేనెక్కడినుంచి వచ్చిందీ నావల్లనే తెలుసుకున్నారు. చివరికి- చాలాసేపు విచారించిన తరువాత 'నీఅభిప్రాయాలూ మా అభిప్రాయాలూ తూర్పు పడమరలు. నీనడవడినీ, నీమాటల్నీ, బట్టిచూస్తే నువ్వు సామ్యవాదిలాగానూ, విప్లవకారుడిలాగానూ కనిపిస్తున్నావు. కనుక నువ్వు వెంటనే మాప్రపంచంనుంచి వెళ్ళిపోవాలి. సామ్యవాదు లిక్కడ ఉండకూడదు.' నా హృదయం ఆనందంతో స్పందించింది ఆ ప్రపంచాన్ని చూసేసరికే నాకు దడపుట్టింది. అక్కడ ఉండాల్సొస్తుందేమోనని చాలా భయపడ్డాను. సంతోషంతో పరుగులుతీస్తూ అక్కణ్నుంచి వెళ్ళిపోయాను. 'మాక్కూడా అటువంటి ఆజ్ఞ రాకూడదా?' అని అక్కడున్నవారంతా నన్నుచూసి అసూయపడ్డారు. 'ఇక మనదేశం ఏవిప్లవమూ లేకుండా సురక్షితంగా వుంటుంది. మా ఇష్టమొచ్చినట్లు పాలించవచ్చు' అని రాజుగారు సంతోషంతో ఉబ్బిపోయారు. నన్ను శిక్షించాలనే ఉద్దేశంతో బంధించిన భటుడు ఆ ఆజ్ఞనుచూసి తెల్లపోయాడు. చెవులకు ఆ బాధా నిస్వానాలు దూరమైపోతున్నయ్.

వెలుగు! కళ్లు మిరుమిట్లు గొలిపే వెలుతురు. ఏకోశానా చీకటి లేనేలేదు. నిరంతరం తియ్యని సంగీతం! చెవులు తేనెతోనిండినట్లున్నది. హృదయం ఆసంగీతానికి ఆనందంతో నృత్యంచేస్తోంది. ఎంత శ్రద్ధగావిన్నా చల్లగాలుల సంగీతం తప్ప బాధ, నిట్టూర్పులు. మొదలైనవేవీ వినిపించటంలేదు. ఆ కాంతిలో చిన్న ఇరుకు దోవకూడా అతిస్పష్టంగా కనిపిస్తోంది. ఇదివరకంతా చీకటిని చూసీ చూసీ అలసిన కళ్లు ఆవెలుతురులో విశ్రమిస్తున్నయ్. ఒక్కొక్క చల్లగాలి వీచేసరికీ శరీరం అమిత సౌఖ్యం పొందుతోంది. ఎటువైపు చూసినా పచ్చటిభూమి ఆ వెలుతురులో అందంగా కనిపిస్తోంది. ఆ ప్రపంచపు శోభకు నావళ్లు నేనే మరచి ఆ అనంతశోభలో ఐక్యమౌతున్నాను. చాలాదూరం ప్రయాణంచేయటంచేత ఆ సౌందర్యాన్ని చూసి మత్తెక్కినది. కళ్లు మూసుకున్నయ్. ఆ సౌందర్యం నన్నెంతసేపు జోకొట్టిందో నాకు తెలియదు, కళ్ళుతెరిచి చూసేసరికీ ఇద్దరు మనుష్యులు బుజాల మీద చేతులువేసుకుని కబుర్లాడుతూ పోతున్నారు. ఇద్దరిలో ఒకరినెత్తిమీద ధగధగ మెరిసే రాజకిరీటం, ఇంకొకరినెత్తిన చినిగిన పంచతోచుట్టుకున్న తలపాగా, ఆశ్చర్యంతో అమాంతం లేచి కూర్చున్నాను. ఇదివరకెప్పుడూ అటువంటి దృశ్యాన్ని చూసిఉండకపో

పటంవల్ల నాకళ్లు దాన్ని పదేపదే సార్లు- వారిద్దరూ దృష్టికందినంత వరకూ చూసి సంతృప్తి చెందుతున్నయ్. ఆనందంతో లేచి ముందుకుపోయాను. ఇటువంటి కొత్త దృశ్యాలింకెన్నో కనిపిస్తయ్ అనే ఆశతో. ఒకచోట ఇద్దరు అమితానందంతో కౌగలించుకొంటున్నారు ఒకడు కుర్రాడు, ఇంకొకతె ముసలిది. ఆ ఆలింగనంలో మాతృత్వం ప్రతిబింబిస్తోంది. వీరి ఆనందాన్ని చూసి నాహృదయంకూడా ఆనందిస్తోంది. కొంతసేపైనతరువాత ముసలిది తమ కథచెప్పింది. తల్లి కౌగిట్లోఉన్న ఆకుర్రాణ్ణి మృత్యువు బలవంతాన తన కౌగిట్లోకి తీసుకుంది. ముసలిది అకుర్రాడికోసం తపించి చివరికి మరణించి తన ముద్దుల కొడుకును తిరిగి తన కౌగిట్లోకి తీసుకుంది. వీరిద్దరి ఆనందానికీ మేరలేదు. ఆమె ఆనందంతో మాతృత్వ పూరితమైన తనచేతుల్లో కుర్రాణ్ణి తిరిగితిరిగి కౌగలించుకొని ముద్దాడుతోంది. ఆనందంతో తన్మయుణ్నై ముందుకు నడిచాను.

ఒకచోట ఇద్దరు- యువతీ, యువకుడూ- ఒళ్ళు తెలియని ఆనందంతో ఒకళ్ళనొకళ్ళు కౌగలించుకొంటున్నారు. ఆకౌగిలిలో ఏదో పవిత్రత- చివరికది స్వార్థంలేని 'పవిత్రప్రేమ' అని తెలుసుకోగలిగాను- గోచరిస్తోంది. తన్మయానందంతో ఒకరినొకరు ప్రేమపూరిత స్వరాలతో సంబోధించుకుంటున్నారు. కొంతసేపు అక్కడే నిలబడ్డాను. అప్పుడు వాళ్లు తమ కథను చెప్పారు. ఆయువకుడు ఇదివరలో ఆమెను తన భార్యను చేసుకోవాలనుకున్నాడు. కాని వారిద్దరికీ మధ్య అభేద్యమైన 'కులము' అనే పెద్ద ఇనపగోడవుంది. కాని ఆయువకు డాగోడను తేలికగా దాటేశాడు. సంఘం అతన్ని బహిష్కరించింది. ఇంతలో ఆ యువతి మృత్యుగర్భంచేరింది. ఆప్రపంచంలో ఆమెను మళ్లా కలుసుకోలేక ఆమెకోసం తపించి చివరికి తాను కూడా మృత్యుగర్భం ప్రవేశించాడు. తరువాత ఆమెకోసం వెతుకుతూ ఒకచోట ఆమెను కలుసుకున్నాడు. ఇప్పుడు వాళ్ళిద్దరిమధ్యా కులభేదంలేదు. అడ్డు పెట్టటానికి గుడ్డిసంఘంలేదు. తిరిగి తన ప్రేయసిని పొందగలిగానని అతడూ, తన ప్రియుని మళ్లా కలుసుకోగలిగానని ఆమె, సంతోషంతో ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటున్నారు. వారిద్దరిమధ్యా ప్రవహించే స్వార్థంలేని అనంతమైన ఆప్రేమవాహిని నా హృదయాన్ని ఆనందపరిచింది. ఆ వాహిని యొక్క పవిత్రత, ప్రశాంతత, నాకు మరపురావటంలేదు.

ఉత్సాహంతో ముందుకునడిచాను. కొందరు స్త్రీలు కనిపించారు. పురుషులెవరూ వారిని అగౌరవపరచటంలేదు. వాళ్లు స్వేచ్ఛగా ఏవిధమైన నిర్బంధమూ లేకుండా ప్రతిచోటికీ పోతున్నారు. కాని అందరి తలలమీదా కిరీటాలు ధగధగ మెరుస్తున్నయ్. అవి మాతృత్వమనే కిరీటాలు. కొందరు భటులూ అధికార్లూ కనిపించారు. వాళ్లచేతుల్లో హింసాపూరితమైన ఆయుధాలేవీలేవు. ప్రతివాడితోనూ అమిత శాంతంగా ప్రవర్తిస్తున్నారు. వారి మాటల్లో నమ్రత ప్రతిబింబిస్తోంది. కాని అబద్ధమాడినవాడికి మటుకు కఠినశిక్ష వేస్తున్నారు. నా హృదయం ఆనందంలో మునిగి తేలుతూంది. అక్కడచూచిన దృశ్యాలన్నీ ఇంకా మనస్సులోంచి తొలిగిపోలేదు. ఇంకా అవి కళ్ళెదుట కనిపిస్తూనే వున్నయ్. ఇంకాకొన్ని దృశ్యాల్ని చూడాలని ఆసక్తితో ముందుకు నడిచాను.

'మాతృభూమికీజై' అని గట్టిగా చెవులు గింగురుమనేట్టు సంతోషంతో కేకలువేస్తున్నాడొక యువకుడు. అతడు మాతృదేశంకోసం ప్రాణాల్ని ధారపోశాడు. 'తల్లిని ప్రేమించటంతప్పు! స్తుతించటం అంతకంటేతప్పు!' అనే ప్రభుత్వం అతణ్ణి శిక్షించింది. చివరికతడు దేశంకోసమే ప్రాణాలను అర్పించాడు. తనను ప్రతిఘటించేవాళ్లు లేకపోవటంచేత సంతోషంతో మాతృదేశానికి నమస్కరిస్తున్నాడు. నాహృదయంలో మాతృదేశంమీది ప్రేమ పొంగి పొర్లింది. నేనుకూడాగట్టిగా 'భారతమాతకుజై' అని అరిచాను...

...అంతా నా మామూలు పూరిగుడిసే!... ఇంటికప్పు సందుల్లోంచి సూర్యుడు కిరణాలతో ముఖంమీద గుచ్చుతున్నాడు.